క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



దళిత నాయకులతో కలసి మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి చిరంజీవి

రోలుగుంట : పాయకరేవుపేటలో రాజ్యాంగ అధినేత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి డిమాండ్ చేశారు. బీద, బడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని అన్నారు. కార్యక్రమంలో యేసు, అప్పారావు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు వితరణ



నిత్యవసర సరుకులు ఇస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టరు రాజాన వీర సూర్యచంద్ర

నాతవరం: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టరు రాజాన వీర సూర్య చంద్ర చేయూతనిచ్చారు. మండలంలో గునుపూడి గ్రామానికి చెందిన నిండుగొండ వెంకన్న తాటాకు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిబూడైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన వెంకన్న కుటుంబాన్ని మంగళవారం సూర్య చంద్ర పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులకు 100కేజీలు బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం పరంగా వచ్చే ఆర్థికసాయం, హౌసింగ్ కాలనీలో ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రామపెద్దలు మాకిరెడ్డి వెంకటరమణ వెలగల వెంకటరమణ ఉన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి విరాళం



ఎం.కోడూరులో సర్పంచ్‌కు నగదు అందజేస్తున్న కొండలరావు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయాభివృద్ధికి అనకాపల్లికి చెందిన శానాపతి కొండలరావు, రమణమ్మ దంపతులు రూ. 20వేలు నగదును మంగళవారం అందజేశారు. ఈ నగదును ఆలయంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎం.రమణబాబుతో పాటు పడాల అప్పలనాయుడు, జి. రాజేశ్‌కుమార్, ఎ.నాయుడు, గణేశ్, కలిమి గోపాల్ పాల్గొన్నారు.

1417 దివ్యాంగ పింఛన్ల విచారణ

మాకవరపాలెం : మండలంలో 1417 మంది దివ్యాంగ పింఛన్లపై విచారణ చేయనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 1417 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉన్నారన్నారు. వీరిలో 183 మందికి మొదటి విడతగా ఈ నెల 5, 6, 11, 12 తేదీల్లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో విచారణ జరుగుతుందన్నారు. ఇప్పటికే విచారణ విషయాన్ని పింఛనుదారులకు తెలియజేశామన్నారు.

అపరాలు.. ఆదరువుగా...



సాగరంలో సాగవుతున్న పిల్లి పెసర

- పంటల మార్పిడితో రైతుకు సిరులు
- రబీ సీజన్‌లో పెరుగుతున్న సాగు
- తగ్గిన వరి విస్తీర్ణం
- మార్కెట్‌లో అపరాలకు పెరుగుతున్న డిమాండ్
- సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



వీరనారాయణంలో సాగు చేస్తున్న మినప పంట

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంట కోతలు కోసిన తర్వాత గ్రామాల్లో అపరాల సాగు మీద రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. అరుతడి పంటలు అయిన రబీ సీజన్‌లో అపరాలు సాగు వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుదని, రైతులు భావిస్తున్నారు. అపరాలకు మార్కెట్టులో ధర పెరగడం వల్ల మినుములు, పెసలు, పిల్లి పెసర, కట్టెజనుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, చోడి, అలసంద, బొబ్బర్లు, వేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో అలసంద, బొబ్బర్లు, కంది పంటలు మెట్ట భూముల్లో సాగు చేస్తున్నారు. దీనితో పాటు నీటి ఆధారం వున్న కొన్ని చోట్ల రబీ వరి కూడా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కోతలు సమయంలో నవంబర్, డిసెంబర్, మాసాల్లో కురిసిన వర్షాల వల్ల కొన్ని గ్రామాల్లో అపరాల విత్తనాలు కొట్టుకుపోయాయి.

పంట మార్పిడితో భూసారం పెంపు

ప్రతి సీజన్‌లో ఒకే పంట పండించకుండా, ప్రతి ఏటా పంట మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందని, గత ఐదు సంవత్సరాలు కాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలో వీఏఏలు,వీహెచ్ఏలు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో రైతులు రబీ సీజన్‌లో వరి పంటకు బదులు అపరాలు వేస్తున్నారు. పెసర, మినుము, పిల్లిపెసర, పంటలు ఖరీఫ్ వరి కోతలు కోసిన తర్వాత అపరాలు వేస్తున్నారు.

అపరాల సాగు బాగుంది



గత ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో వరి పంట కోతకు వచ్చే సమయంలో రైతులు ఇబ్బడిముబ్బడిగా మినుములు, పెసలు చల్లారు. అయితే అకాల తుపాను వర్షాల వల్ల పంట నష్టపోయారు. మళ్లీ వ్యయ ప్రయాసలు పడి అపరాలు చల్లారు. ప్రస్తుతం అపరాల సాగు బాగుంది.

–మద్దాల వెంకట సత్యనారాయణ(రమణ), రైతు, కె.జె.పురం

అపరాలతో పాటు కూరగాయలు



అపరాలు పంటలకు తెగుళ్ల సోకుతున్నాయి. అయితే ఈ తెగులు నివారణకు గాను సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నాం. రబీ వరి పంటకు బదులుగా అపరాలుతో పాటు కూరగాయలు సాగు కూడా రైతులుకు ఎంతో మేలు చేస్తుంది.

–పోతుబంది రాజుబాబు, రైతు, ఎం.కోటపాడు గ్రామం

సస్యరక్షణ పాటించండి



అపరాలు సాగు విషయంలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో వాసుదేవరావు పేర్కోన్నారు. మినప పంటకు నెల రోజులు తర్వాత నీటితో తడపాలని, రెండో పర్యాయం 50 రోజుల తర్వాత తడి పెట్టాలని, పల్లాకు తెగులు నివారించుకోవాలని రైతులకు సూచించారు. అపరాల పంటకు తెగుళ్ల సోకితే వీఏఏలు, వీహెచ్ఏలను సంప్రదించాలని సూచించారు.

–ఎం.వాసుదేవరావు, మండల వ్యవసాయాధికారి, మాడుగుల

పెరిగిన సాగు విస్తీర్ణం

మండలంలో మినప పంట సాధారణ విస్తీర్ణం 1000 ఎకరాలు కాగా, 1500 ఎకరాల్లో వేశారు. పెసర సాధారణ విస్తీర్ణం 100 ఎకరాలు కాగా 117 ఎకరాల్లో వేశారు. నువ్వులు సాధారణ విస్తీర్ణం 375 ఎకరాలు కాగా, ప్రస్తుతం 40 ఎకరాల్లో వేశారు. నువ్వు విస్తీర్ణం ఇంకా పెరుగుతుందని స్థానిక మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు అన్నారు. ప్రస్తుతం చెరకు కార్సి తోటలు తీసిన తర్వాత నువ్వులు చల్లుతారన్నారు. రబీ వరి సాధారణ విస్తీర్ణం 1250 ఎకరాలు కాగా, 557 ఎకరాల్లో మాత్రమే వేశారు. నీటి ఆధారం వున్న ప్రాంతంతో పాటు వ్యవసాయ మోటారు పంపుసెట్లు వున్న చోట్ల రబీ వరి సాగు చేస్తున్నారు. దీంతో పాటు కట్టె జనుము 20 ఎకరాల్లో వేశారు. గిరిజన గ్రామాల్లోని మెట్ట భూముల్లో అలసంద, బొబ్బర్లు, కంది, చోడిపంట వేశారు. వీటితో పాటు కొన్ని గ్రామాల్లో పొద్దు తిరుగుడు కూడా సాగు చేస్తున్నారు.

ఉత్తమ సర్పంచ్‌కు మానస సంస్థ అభినందనలు



ఉత్తమ సర్పంచ్ కామలక్ష్మి ఈశ్వరరావులను సత్కరిస్తున్న పరమేశ్వరరావు తదితరులు

మాడుగుల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు 90 శాతం సక్సెస్ ఫుల్‌గా గ్రామంలో అమలు చేయడంతో పాటు గ్రామాని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో వీరవిల్లి అగ్రహారం సర్పంచ్ యలగాడ కామలక్ష్మిఈశ్వరరావు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా డిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పురస్కారం అవార్డు అందుకోవడం తెలిసిందే. అయితే మానస సంస్థ వ్యవస్థాపకుడు పరమేశ్వరరావుతో పాటు ఆ సంస్థ సిబ్బంది మంగళవారం మాడుగులలో ఘనంగా సర్పంచ్ కామలక్ష్మి ఈశ్వరరావులను దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడారు. సర్పంచ్ కృషి ఫలితంగానే మాడుగుల మండల కేంద్రానికి సుదూరంలో ఉన్న చిన్న గ్రామం వీరవల్లి గ్రామానికి దేశ రాజధాని ఢిల్లీలో పేరు దక్కిందని అది మాడుగుల నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తధితరులు పాల్గొన్నారు.

విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నర్సీపట్నం : బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపుదలను వ్యతిరేకిస్తూ భోజన విరామ సమయంలో ఎల్ఐసీ ఉద్యోగులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎఫ్‌డీఐ 74 శాతం నుంచి 100 శాతం పెంచడానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలంటూ నినాదాలు చేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంకిపాటి భద్రం పడాల్ మాట్లాడుతూ అత్యధిక లాభాల్లో ఉన్న ఎల్ఐసీని నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎల్ఐసీలో ప్రైవేటు పెట్టుబడులను నిలుపుదల చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. నిరసనలో అసోసియేషన్ నాయకులు వంటాకుల శ్రీరామ్‌మూర్తి, వంకల చిన్నయ్య, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ధనార్జన్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ సమస్య



మాడుగుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మాడుగుల : మాడుగుల నియోజకవర్గంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్వెంటర్లు పని చేయక సర్వర్లు పని చేయడంలేదని, రిజిస్ట్రేషన్‌కు వచ్చినవారు ఉదయం నుంచి సాయంకాలం వరకు పడిగాపులు కాస్తున్నారు. రెండు నెలుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. విద్యుత్‌కు అంతరాయం కలిగితే ఇన్వెంటర్లు పనిచేయక సర్వర్లు ఆగిపోవడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయని, మరలా విద్యుత్ సరఫరా వచ్చినా ఇన్వెంటరులు నిలిచిపోవడంతో కంప్యూటర్‌లు మొరాయిస్తున్నాయని చెబుతున్నారు. దీంతో అత్యవసరంగా లావాదేవీలు చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తమ్‌ను సంప్రదించగా అప్పుడప్పుడు సర్వర్‌లు ఇబ్బంది పెట్టడం వాస్తవమేనని, కాస్త ఆలస్యమైనా సరే రిజిస్ట్రేషన్‌లు ఆపడం లేదన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో వివక్ష వద్దు



కోడ్ సర్క్యులర్‌ను నోటీసు బోర్డులో పెడుతున్న కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథి

నాతవరం : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పని చేయాలని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి అన్నారు. ఆయన మంగళవారం పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తితో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ సర్క్యులర్‌ను నోటీసు బోర్డులో పెట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కోడ్ ప్రకారం మండల వ్యాప్తంగా రాజకీయ పార్టీల కటౌట్లు, బ్యానర్లు, జెండాలు ఉండరాదని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసినవి ఉంటే వెంటనే తొలగించాలన్నారు. పోలింగ్ జరిగేంతవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీల సమావేశాలకు వెళ్లరాదన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో ఏ సమావేశం నిర్వహించాలన్నా విధిగా ఎన్నికల కమిషన్ అనుమతి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంటు ఎం. ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ధనలక్ష్మి



లంకవానిపాలెం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారి శైలజ, తదితరులు

రోలుగుంట : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ధనలక్ష్మి సిబ్బందితో కలసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగుతో సాధ్యం, ముందస్తు పరీక్షల ద్వారా–క్యాన్సర్‌ను నివారిద్దాం అంటూ ర్యాలీలో చైతన్యపరిచారు. పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు, చికిత్స, జాగ్రత్తల గురించి వైద్యాధికారి వివరించారు. ఎంపీహెచ్ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ షాజహాన్, పీహెచ్ఎన్ సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు అనుమానిత లక్షణాలు గల వారు పరీక్షలు జరుపుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. కేన్సర్ నివారణపై మంగళవారం ఆమె పీహెచ్‌సీ పరిధిలో గల వైద్య సిబ్బందితో కరపత్రాల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను అన్ని గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి వ్యాధిని అదుపులోకి తేవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.విశ్వకాంత్, పీహెచ్ఎన్ ప్రమీల, మణికుమారి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

మాకవరపాలెం : క్యాన్సర్ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి శ్రీవిద్య వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. క్యాన్సర్ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఈ వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథ సప్తమి వేడుకలు



చోడవరంలో 108 సూర్యనమస్కారాలు సామూహికంగా చేస్తున్న విద్యార్థులు



సూర్యనారాయణస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : రథసప్తమి పర్వదినాన్ని మండలంలో పలు గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆర్.వై.అగ్రహారం గ్రామంలో గల సూర్యనారాయణస్వామి వారిని పలు గ్రామాల భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలను జరిపారు. మండలంలో గల ఏకైక సూర్యనారాయణస్వామి ఆలయం కావడంతో పూజలను నిర్వహించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు.

ఖండివరంలో సూర్య నమస్కారాలు

చీడికాడ : రథసప్తమి పర్వదినం సందర్భంగా ఖండివరం గ్రామంలో గల శివాలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నది ఒడ్డున సూర్య నమస్కారాలు చేశారు. చీడికాడ, తురువోలు, పెదగోగాడ, అప్పలరాజుపురం గ్రామాల్లో రథసప్తమి సందర్భంగా భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించి, సూర్యనమస్కారాలు చేశారు.

సూర్యచంద్రుల దేవాలయంలో..

చోడవరం : రథసప్తమి పర్వదినం సందర్భంగా గౌరీపట్నం గ్రామం సమీపంలో పెద్దేరు నది ఒడ్డున వేంచేసియున్న శ్రీ సూర్యచంద్రుల దేవాలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. చోడవరం పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. స్థానిక పతంజలి యోగా కేంద్రం, శ్రీనివాస యోగా కేంద్రం ఆవరణలోను, గవర్నమెంటు హైస్కూల్ ఆవరణలో క్రీడాభారతి ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా విద్యార్థులంతా కలిసి సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. సుమారు 200 మంది విద్యార్థులు ఒకే చోట చేరి 108 సూర్యనమస్కారాలు చేశారు. యోగా గురువులు పుల్లేటి సతీష్, అర్రెపు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువు శ్రీనివాసరావు మాట్లాడుతూ సూర్యనమస్కారాలతో కూడిన యోగా చేయడం వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో చోడవరం ఉషోదయ విద్యాసంస్థల ఆవరణలో సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పల్లెల్లో సందడిగా తీర్థ మహోత్సవాలు



వి.వి.అగ్రహారం చంద్రమ్మదొర విగ్రహం వద్ద జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలరాజు



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న చంద్రమ్మదొర కుటుంబ సభ్యులు



తీర్థంలో పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు



మసమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలో నిల్చున్న భక్తులు



బంగారమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల పూజలు



మిరాంలో సూర్యనారాయణమూర్తిని దర్శించుకుంటున్న భక్తులు



శంభువానిపాలెంలో హోరాహోరీగా ఎడ్లబళ్ల పోటీలు

మాడుగుల రూరల్ : వి.వి.అగ్రహారం పెట్రోల్‌బంక్ వద్ద గల దొండా చంద్రమ్మదొర తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల సమితి తొలి అధ్యక్షులు అయిన చంద్రమ్మదొర వర్ధంతిని పురస్కరించుకుని, దొర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు ఆవిష్కరించారు. మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, స్థానిక నాయకులు పాచిల నాగేశ్వరావు, తలారి రమేష్, సయ్యపురెడ్డి నాగ, పాచిల రమణ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. సాయంత్రం తీర్థం జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా మసమ్మతల్లి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంట రహదారిలో బుద్దావారి కళ్లాలు వద్ద వున్న మసమ్మతల్లి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఏటా రథసప్తమి రోజున ఈ తీర్థం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా గ్రామంలో 101 ఘటాలతో ఆలయానికి ఊరేగింపుగా వాయిద్యమేళాలతో వెళ్లి, భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద బుర్రకథ ప్రదర్శించారు. జిల్లా స్థాయి గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులకు ఉచిత టోకెన్ అందజేశారు. డ్రా తీసి బహుమతులు అందజేశారు.

వైభవంగా బంగారమ్మతల్లి తీర్థం

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం, చిరికివానిపాలెం గ్రామస్థులు గ్రామదేవత బంగారమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారి ఆలయంలో రెండు గ్రామాల ప్రజలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రేపు కోదండ సీతారామాంజనేయ తీర్థం

చీడికాడ: మండలంలో ఖండివరం గ్రామంలో ఈ నెల 6వ తేదీ గురువారం కోదండ సీతారామాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి పూజలు, అభిషేకాలు, నిర్వహిస్తున్నట్టు భక్తులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

తిమిరాంలో సూర్యభగవానుడి తీర్థం

దేవరాపల్లి : తిమిరాంలో రథసప్తమి, సూర్యనారాయణమూర్తి తీర్థాన్ని పురస్కరించుకొని మంగళవారం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమిరాంలోని సూర్యభగవానుడి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. తిమిరాంతో పాటు పరిసర గ్రామాల భక్త జనం దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు హోరాహోరీగా జరిగాయి. శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లపోటీలు, వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించాలి



క్యాన్సర్ నివారణకు కృషి చేయాలంటూ నినదిస్తున్న ఆశ కార్యకర్తలు



అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించడం ద్వారా మరణాలు సంభవించవని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవళిక పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ సోకకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ నెల 13న కుష్టు వ్యాధి నివారణలో భాగంగా స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో దేవకాంత, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అచ్యుతాపురం: వాతావరణంలో కాలుష్యంతో పాటు ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను తినడం ద్వారా, జంక్ ఫుడ్స్ వల్ల క్యాన్సర్ కణాలు శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయని వైద్యాధికారి లిఖిత తెలిపారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.